"మంచిదే తల్లీ, మీ బతుకులు మార్చి, ఆ మాటకి అర్థం మారితే నా కంటే సంతోషించేవాళ్ళెవరుంటారు. కానీచూద్దాం, కాలం ఏంనిర్ణయిస్తుందో. మా తరంలో మేం చెయ్యలేనిది మీరు చేసి చూపిస్తే మాకు మాత్రం సంతోషంగాదూ...."మరి మారని కాలంలో ఓ తండ్రిగా ఆయన ఇంకేం అనలేదు కూతురి నిశ్చయం, నిర్ణయం అర్థం అయి.

[ ఇండియా టు డే ]

★

# మళ్ళీ పెళ్ళి

సుగుణ, భాస్కరరావులు ఆ రోజు రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి చేసుకున్నారు! తరువాత ఓ దేవాలయంలో సుగుణ మెడలో మంగళ సూత్రం కూడా కట్టాడు భాస్కరరావు లాంఛనంగా.

రోజూ ఎన్ని వేలమందో పెళ్ళి చేసుకుంటున్నారు. అందులో సుగుణా భాస్కర్రావులు ఒకరు. ఇందులో ఏం వింత వుందని ఎవరన్నా అనుకోవచ్చు? పెళ్ళి చేసుకోడం వింత విషయం గాదు. ఎటొచ్చి వింతఅల్లా వితంతువుని, అందులో పిల్లాడి తల్లిని భాస్కరరావు పెళ్ళాడడం వింతేగా మరి! భాస్కరరావుకి రెండో పెళ్ళే! అయినా మగాడు. అందులో ముప్ఫైఏళ్ళవాడు రెండో పెళ్ళి చేసుకోడం అతి మామూలు విషయం!

అందుకే భాస్కరరావుని పొగడ్తలతో, శుభాకాంక్షలతో సహోద్యోగులు, మిత్రులు, అధికారులు ముంచెత్తారు. అతని సంస్కారాన్ని. ఆదర్శాన్ని పొగిడారు. అతని హృదయ వైశాల్యాన్ని కొనియాడారు. భాస్కర్రావు హృదయం గర్వంతో మరింత విశాలం అయింది. చాలా మంచి పని. ఘనకార్యం సాధించిన తృప్తితో అతని మనసు నిండిపోయింది.

ఇంక సుగుణ స్థితి!........ఆమెకి యిప్పటికీ యిదంతా నిజంకాదేమో భ్రమేమోననే అనుమానం! ఈ పెళ్ళి నమ్మశక్యం కాని విషయంలాగే అనిపిస్తొంది.

పెళ్ళి అయిన ఎనిమిది నెలలకే కారుయాక్సిడెంటులో భర్తపోతే ఇంకెందుకీ బ్రతుకనుకుంటూ అందరిలాగే కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. దేన్లోనన్నా పడి చద్దా మను కుంది. ధైర్యం చాలకపోవడం కాక. తనతోపాటు మరో ప్రాణినిహత్య చేయడం పాపం అన్న పాపభీతితో ఆ పని చేయలేక పోయింది. తరువాత....పిల్లాడు పుట్టాక వాడికోసం బ్రతకక తప్పదని నిశ్చయించుకుని, ప్రాణాలు, ఆశలు, కలలు అన్నీ ఆ పసికందు మీదే నిల్పుకుని నిర్లిప్తంగా రోజులు వెళ్ళదీయసాగింది.

నా అని చెప్పుకోడానికి ఒక అన్న మాత్రం వున్నా........ఆ అన్న మీద జీవితాంతం ఆధారపడి వుండడం యిష్టంలేక· ఉన్న డిగ్రీ ఆధారంతో ఉద్యో గంలో చేరింది.

సహోద్యోగి అయిన భాస్కరరావుతో పరిచయం, ఏణ్ణర్ధంలో యీ విధంగా మలుపు తిరిగి రూపు దాలుస్తుందని సుగుణ ముందుగా ఎన్నడూ అనుకోలేదు. తీరా చేసి రూపు దాల్చాక ఏం చెయ్యాలో తోచని అయోమయంలో పడిపోయింది సుగుణ.

పరిచయం అయిన ఏణ్ణర్ధం తర్వాత భాస్కరరావు "పెళ్ళిచేసుకుందాం" అని అడిగినపుడు సుగుణ తడబడిపోయింది! భయపడింది! బాధపడింది! ముందుగా సహఉద్యోగిగా, తరువాత మంచి మిత్రుడిగా, ఇంకొన్నాళ్ళ తర్వాత శ్రేయోభిలాషిగా మాత్రం అనుకుంది భాస్కరరావుతో పరిచయం పెరుగుదున్న కొద్దీ! అంతకు తప్ప మరో భావం ఆమె మనసులో ఎన్నడూ లేదు. అందుకే కలవర పడిపోయింది. భాస్కరరావు అడగ్గానే.

భాస్కరరావు అయితే సుగుణని చూసిన ముందు రోజునించీ ఒకే అభి ప్రాయంలో ఉన్నాడు. అందంగా వుంది. అయినింటి పిల్ల! పెళ్ళాడు దామను కున్నాడు, ఆమె విధవ అని తెలియక పూర్వం! తీరాచేసి ఆ సంగతి తెలిశాక. అప్ప టికే అతని మనస్సులో నాటుకుపోయిన కోరికని పీకిపారేయడం అతని వశంలో లేక పోయింది. రెండో పెళ్ళి అయితేనేం....నాకు మాత్రం రెండో పెళ్ళి కాదా! యిలాంటి విషయాలలో పురోగ మించాలి. అని సర్ది చెప్పుకున్నాడు. పిల్లాడు వున్నా డన్న విషయం మీద చాలా రోజులు ఆలోచించాడు భాస్కరరావు. ఆఖరికి వుంటేనేంలే వాడిని వాళ్ళమ్మ చూసుకుంటుంది. తనేం చెయ్యాలి. వాడి పోషణ ఖర్చేగా. వాడి పోషణ ఖర్చు వాడి అమ్మే పెట్టుకుంటుంది. ఉద్యోగం చేస్తుందిగా. తనకేం నష్టం వుండదు. అని సచ్చచెప్పుకున్నాడు. ఈ పెళ్ళిని అభ్యంతర పెట్టే పెద్దలు తనకి ఎవరూ లేరు. అన్నగారున్నా ఆయన యీ కాలం వాడేగనక అభ్యం తర పెట్టడు. అసలు కలుగ చేసుకోడు తన విషయం. అన్నీ నిశ్చయించుకుని తన ఉద్దేశం సుగుణ ముందు బయట పెట్టాడు.

సుగుణ ముందు కాదంది. అలాంటి పని చేయలేనంది. భాస్కరరావు అనేక విధాల నచ్చచెప్పాడు. రోజులు మారాయి. మనమూ మారాలి అన్నాడు. తప్పొప్పుల ప్రసక్తి ఏం లేదని నొక్కి చెప్పాడు. ఆలోచించుకోమన్నాడు.

సుగుణ ఒక రోజుకాదు. మూడునెలలు రాత్రింబగళ్ళు ఆలోచించింది. యీ సమస్య ఎన్నాళ్ళు ఆలోచించినా ఎటూ తేల్చుకోలేని అయోమయంగానే కన పడింది ఆమెకి! పోయిన భర్తకి ద్రోహం చేస్తున్నట్టు బాధ. ఏదో కానిపని చేస్తున్నట్టు పాపభీతి, నలుగురికీ మొహం ఎలా చూపడం. ఏమనుకుంటారన్న కుళం కలు ఓ వైపు. మరోవైపు.... మోడై పోయిన తన జీవితం మళ్ళీ చిగిర్చి పుష్పిస్తుందన్న ఆశ.

—యిలా ఎటూ తేల్చుకోలేక నలిగి పోయింది. ఈ రెండేళ్ళలోనే తన బ్రతుకులో ఏర్పడిన వెలితి, నిర్లిప్తత తలచుకొని, ముందు రోజులు ఇంకెలా గడుస్తాయో ఊహించి తనకి దొరికిన అవకాశాన్ని ఎందుకు వినియోగించుకోకూడదూ అన్న ఆలోచన వచ్చేది. తను తన బిడ్డని పోషించుకో గలదు, కాని....కానీ.... పట్టుమని పాతికేళ్ళు లేని తను....పట్టుమని ఆరునెలలు కూడా కాపురం చెయ్యని తను....ఆ ఆరునెలలని తల్చుకుంటూ అరవై ఏళ్ళ వంటరిగా బ్రతకగలదా! బ్రతుకులో మాధుర్యం చచ్చిపోయి, చావలేక బ్రతుకుతూ బ్రతికే బ్రతుకు కంటె భవిష్యత్తు మళ్ళీ అందంగా, ఆనందంగా బ్రతికే అవకాశం కాళ్ళ ముందుకు వచ్చి నిల్చుంటే తనెందుకిలా ఆలోచిస్తూంది! ! తరతరాలుగా భారతస్త్రీ సంస్కృతి, సాంప్రదాయాలు జీర్ణించి పోయిన భారతస్త్రీ వారసురాలు సుగుణ, కనకే సుగుణ అన్నాళ్ళు యీ విషయం ఆలోచించింది. అన్నగారి ముందు యీ సమస్యని పెట్టింది సుగుణ. అభ్యంతరం చెపుతాడను కున్న అన్న కూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. నీ యిష్టం. వ్యక్తిత్వం వచ్చినదానివి. చదువుకున్న దానివి, నీకు నేనేం చెప్పను? ఆలోచించుకో, ముందుకి అడుగు వేయాల్సిందానివీ నీవే, ఆ పర్యవసానం ఎలాంటిదైనా అనుభవించాల్సిందీ నీవే. నీవేం చిన్నపిల్లవిగావు. నేనేం చెప్పగలను" అన్నాడు. నీ యీ పనివల్ల నన్ను వెలేస్తారని యీ రోజుల్లో భయం లేదు. కనక ఆలోచించుకుని నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి. నీవు మళ్ళీ పసుపు కుంకంతో సుఖంగా వుంటానంటే నేను మాత్రం సంతోషించనా? అన్నాడు. అనుకున్న ఆ అభ్యంతరం కూడా లేకపోయిం తర్వాత యింకెన్నాళ్ళో ఆలోచించ లేదు సుగుణ. అన్నగారు కూడ తన బరువు బాధ్యతలని ఇంకెన్నాళ్ళో మోయలేరని సుగుణకీ ఈ మధ్య అర్థం అవసాగింది. తను సంపాదిస్తున్నా, తన బరువు మోయడం అన్నగారికి ముఖ్యంగా వదిన గారికి యిష్టంలేదనీ యీ మధ్య చాలా సందర్భాలలో గ్రహించింది సుగుణ. అలాంటి పరిస్థితిలో పిల్లాడిని పెట్టుకుని వంటరిగా

వుండి రోజులు భయం భయంగా వెళ్ళబుచ్చడం కంటె మళ్ళీ తను, తన ఇల్లు, సంసారం అంటూ ఏర్పరుచుకుంటే తప్పేమిటనుకుంది సుగుణ.

తను చేస్తున్న పనిలో తప్పులేదని తనకి తను నచ్చచెప్పుకోడానికి సుగుణకి మూడు నెలలు పట్టింది. ఆ తర్వాత భాస్కరరావుకి తన అంగీకారాన్ని చెప్పింది సుగుణ.

భర్త పోయిన రెండు సంవత్సరాల తరువాత మళ్ళీ విధవ వేషంలోంచి వధువు వేషంలోనికి మారటం ఏదో కలలో మాదిరి అన్పించ సాగింది సుగుణకి.

అది సుగుణా భాస్కరరావులకి మొదటిరాత్రి. ఇద్దరికిద్దరికి మొదటి రాత్రి అనుభవం తీరిపోయినా ఇద్దరూ కల్సిన మొదటి రాత్రి అది! సుగుణ అన్నగారు ఆ మూడు రోజులు తనయింట గడిపి వెళ్ళమని కోరాడు దంపతులని.

గది చాలా సింపుల్‌గా వుంది. ఓ మంచంమీద తెల్లటి దుప్పటి పరిచిన ప్రక్క, డ్రస్సింగ్ టేబిల్ మీద మంచినీళ్లు, నాలుగురకాల ఫలహారాలున్నాయి. నాలుగు అగరువత్తులుమాత్రం వెలిగించారు. రెండో పెళ్ళికి యింతకంటె ఆర్భాటం అట్టహాసం చేయడం బాగుండదని గది మామూలుగానే వుంచారు.

పదిదాటి ఇరవై నిమిషాలు అయినా యింకా గదిలోనికి రాని సుగుణ మీద విసుక్కుంటున్నాడు భాస్కరరావు! ఆమె రాకకోసం మహా ఆరాటంగా తలుపు వైపు పదేపదే చూస్తూ నిరీక్షిస్తున్నాడు. కాసేపు పేపరుంటే తిరగేశాడు. కాసేపు ఇటూ అటూ పచార్లు చేశాడు. మరోసారి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుని పౌడరు రాసుకున్నాడు ఎన్ని చేసినా సుగుణ రాకపోవడంతో అశాంతిగా ప్రక్క మీద కూర్చున్నాడు.

అక్కడ....ఇంకో గదిలో పిల్లాడిని పడుకోబెట్టడానికి సుగుణ నానాతంటాలు పడ్తూంది. 'వెళ్ళవమ్మా సుగుణా, అతన్నిందాకనగా గదిలోకి వెళ్ళమన్నాం.... బాగుండదు....అప్పుడే పదిన్నర అయింది. నీ వెళ్ల నేను చూస్తానులే రవిని' అంది వదినగారు, అందిగానీ రవి తల్లి ని వదిలి పెడితేనా! వదినగారు ఎత్తుకోబోతే పెద్ద పెట్టున రాగం ఆరంభించాడు. మెడ కావలించుకుని వదలకుండా పడుకున్న రవిని తప్పించుకుని ఎలా వెళ్ళడమో సుగుణకి అర్థం గాలేదు.

'ఎలా వదినా, వీడు నిద్రపోండే....ఏడుస్తున్నాడు ఎలా వెళ్ళడం? అంది కాన్త బిడియంగా. రోజూ యీపాటికి నిద్రపోయే రవి, యివాళ యింతవరకు నిద్ర పోకుండా కళ్ళు విప్పుకుని చూస్తున్నాడు. తల్లి అలంకరించుకోవడం, తనని వంటరిగా వదలి ఎక్కడకో వెళుతుందన్న సంగతి రెండేళ్ళ రవికి అర్థమై పోయింది....అందుకే కాన్త కళ్ళు మూస్తూ, తెరుస్తూ ప్రక్కలో తల్లి వుందో లేదో

నని చూసుకొంటూనే వున్నాడు. జోకొట్టి, నిద్రపోయాడు అనుకుని నెమ్మదిగా లేచే వేళకి, మిళ్ళీ రవి లేచి కూర్చునేవాడు. గంటనించీ యీ భాగోతం జరుగుతూంది.

"బాగుంది ఇవాళ వీడు యిలా అల్లరి పెడుతున్నా డేమిటి? అతను విను కుంటాడో ఏమిటో. కాసేపు ఏడిస్తే ఏడిచాడు నీవు వెళ్ళు" అంది మళ్ళీ వదిన గారు.

కొడుకు యిక్కడ వంటరిగా ఏడుస్తూంటే తనక్కడ....?.... ఛా.... ఎలా? 'ఎలా వదినా?' అంది నిస్సహాయంగా సుగుణ. ఇలాంటి పరిస్థితిని ఎలా ఎదుర్కొ డం? సుగుణకి ఓ ప్రక్క సిగ్గు, బిడియం. భాస్కరరావు ఏమనుకుంటాడోనన్న బెదురు. రవి నిద్రపోకుండా ఎలా వెళ్ళడం అన్న ఆలోచనలో ఆమె మనసు అదో మాదిరిగా తయారయింది.

'పోని వీడిని తీసికెళ్ళి అక్కడే పడుకో బెట్టుతాను' అంది ఆఖరికి సిగ్గువిడిచి సుగుణ పదకొండు అవవస్తూంటే.

'అతనేం అనుకుంటాడో....అలా బాగుండదు! అంది వదినగారు కాసేపు అలా ఇద్దరూ మొహాలు చూసుకుంటూ కుర్చున్నారు. ఈ లోపల నిద్రకి ఇంక ఆగ లేక రవి కళ్లు మూతలు పడ్డాయి. మరో ఐదు నిమిషాలు అలాగే చూసి నెమ్మదిగా చడీ చప్పుడు కాకుండా లేచింది సుగుణ. 'అమ్మయ్య' అనుకున్నారిద్దరూ.

సుగుణని గదిలోకి పంపి వదినగారు రవి మంచం దగ్గిర ప్రక్కేసుకుని పడుకుంది.

భాస్కరరావు గదిలోకి వచ్చిన సుగుణని చూసి అంతవరకు పడిన అసహ నం, చిరాకు మరిచి నవ్వుతూ 'యిప్పుడా తీరుబాటు అయింది రావడానికి' అన్నాడు దగ్గిరికి వచ్చి.

"రవి .. రవి యిప్పటివరకు పడుకోలేదు....నన్ను వదలి పెట్టకుండా ఏడి చాడు" తలవంచుకొని కొంత సిగ్గు పడుతూనే అంది సుగుణ. కారణంవిన్న భాస్కర రావు మొహం అదోలా అయింది. అయినా తొందరగా మొహంలో భావం మార్చేసి "నేనిక్కడ నీకోంన గంటనించి ఎంతలా ఎదురు చూస్తున్నానో తెలుసా, నీకలా ఏం ఆత్రుత లేదన్న మాట. అక్కడ కూర్చున్నావు అలా...." అంటూ భుజాల మీద చేతులు వేసి దగ్గరకి తీసుకోబోయాడు. సుగుణ హఠాత్తుగా ఎందుకో త్రుళ్ళి పడింది. భాస్కరరావు స్పర్శకి ఆమె ఎందుకో కుంచించుకు పోయింది. హఠాత్తుగా తన మొదటిరాత్రి గుర్తువచ్చింది! మనసంతా ఏదో బాధ నిండింది! ఏదో కానిపనికి పాల్పడినట్లు ఆమె హృదయం గిలగిలలాడింది. సుగుణ అస్థితిలో వుండగానే గదిలో నించి రవి ఏడ్పు వినపడడం మొదలుపెట్టింది. సుగుణ కంగారు పడింది. మళ్ళీ లేచి

నట్టున్నాడు. ఈ రెండేళ్ళనించి, భర్త పోయిందగ్గరి నుంచి వాడిమీదే ప్రాణాలన్నీ పెట్టుకుని అనుక్షణం వాడితోనే గడిపేది. రాత్రిళ్ల వాడిని ప్రక్కలో పెట్టుకునే పడుకునేది. తల్లి దగ్గర తప్ప విడిగా పడుకోడం అలవాటులేని పిల్లాడు తల్లి ప్రక్కలో లేనిసంగతి నిద్రలోకూడ గ్రహించి సుగుణ వెళ్ళినవెంటనే మళ్ళీ లేచి కూర్చున్నాడు. వాడిని సముదాయించడం, మళ్ళీ నిద్రపుచ్చడానికి వదినగారు పడే పాట్లు సుగుణకి అన్నీ వినిపిస్తూనే వున్నాయి. వదినగారు పెరట్లోకి లేచి వెళ్ళింది గాబోలు అక్కడనించి కూడా వాడి ఏడ్పు గట్టిగా విన్పిస్తూంది. సుగుణ ఏంచెయ్యాలోతోచనట్లు బెదురుగా చూసింది భాస్కరరావు వంక. అతను అదేమీ పట్టించుకునే స్థితిలో లేడు. ఐదు నిముషాలు గడిచినా రవియేడ్పు అంతకంతకీ ఎక్కువవుతుంటే సుగుణ భరించలేకపోయింది. అమ్మా....అమ్మా.... అన్న పసివాడి ఏడ్పు ఆమె గుండెలని తాకి ఉక్కిరి బిక్కిరి చేయసాగింది. అలా పిల్లాడు యేడుస్తుంటే తనిక్కడ....ఛా....ఆమె హృదయం కొడుకు యేడ్పు విని ఇంకా సహిస్తూ వుండలేకపోయింది. భాస్కరరావు చేతులనించి తప్పించుకుంది, "యేమిటీ!" అన్నాడు కొస్త ఆశ్చర్యంగా భాస్కరరావు.

"బాబు....రవి....ఇందాకటి నుంచి యేడుస్తున్నాడు...." అంది గొణుగుతూ.

"అయితే" అన్నాడు కొస్త అసహనంగా భాస్కరరావు. "వాళ్ళెవరో చూస్తారులే....పడుకో బెడ్తారులే...." అన్నాడు మళ్ళీ. నిస్సహాయంగా చూస్తూ వాడియేడ్పు వింటూ మరి రెండు నిముషాలు చూసింది. ఇంక ఆగలేక "వస్తాను.... ఇప్పుడే వస్తాను" అంటూ వారిస్తున్న భాస్కరరావు చేతులనించి తప్పించుకుంటూ తలుపు తీసుకొని బయటకు వెళ్ళింది. ఊరుకోబెట్టలేక అవస్థపడుతున్న వదివగారి చేతుల్లోంచి పిల్లాడిని తీసుకుంది.

"వదినా!" అంది బేలగా సుగుణ. పిల్లాడిని గుండెల కదుముకుంటూ.

"అమ్మా" అంటూ రవి సుగుణ మెడని గట్టిగా వాటేసుకున్నాడు. సుగుణ కళ్ళలో అప్రయత్నంగా నీరు తిరిగింది.

"అమ్మా!....నీవు నాదగ్గర బజ్జో!" అన్నాడు మాటలు స్పష్టంగా వచ్చిన రెండేళ్ళ రవి. "నీవు వెళ్ళవద్దు నా దగ్గిరే వుండు" అన్నాడు.

"యేమిటమ్మా యిలా అల్లరి పెడుతున్నాడు ఇవాళ.... యేం చెయ్యడం" అంది వదినగారు విసుగ్గా. "ఇవాళ నిన్ను వదిలేటట్టు లేదు ... ఏం చేస్తావు? అతనే మనుకుంటాడో ఖర్మ!...."

"యేంచెయ్యను వదినా....ఛా.... ఇలా వీడిని వదిలి నేనక్కడ ఎలా సుఖంగా...." సుగుణ గొంతు పట్టుకుంది. "పోనీ వీణ్ణి గదిలోకి తీసుకెడతాను అక్కడే వక్క వేసి పడుకోబెడతాను" అంది. మరో అయిదు నిముషాలకు కూడా రవి పడుకునే సూచనలు లేకపోవడంతో అలా తప్ప మరో మార్గం యేంలేదని స్పష్టమయింది. సుగుణ మరో పరుపు పట్టుకెళ్ళి గదిలో వేసివచ్చింది. భాస్కరరావు సుగుణ వచ్చి పరుపు వేయడం మంచం మీద పడుకుని తీక్షణంగా చూశాడు. సుగుణ అది గ్రహించినా చూపులు తప్పించి రవిని తీసుకొచ్చి తలుపులు వేసింది.

'యేమిటిది?....వాణ్ణెందుకు తెచ్చావు' అన్నాడు భాస్కరరావు చిరాగ్గా.

"యేంచెయ్యను. వన్నొదిలి ఎంతకీ నిద్రపోవడంలేదు ... యేడుస్తున్నాడు" అంది శుష్కహాసం చేస్తూ, వాడిని పడుకోబెట్టి జో కొడుతూ.

"హుం....బాగుంది" కర్కశంగా అన్నాడు భాస్కరరావు. అంతకంటే క్రొత్త భార్యను ఇంకేమనాలో అర్థంగాలేదు. అలా తీక్షణంగా కాసేపు చూసి అటు తిరిగి పడుకున్నాడు. అతని వుత్సాహం, ఆత్రుత, ఆరాటం అంతా నీళ్లుకారిపో సాగింది అతనికి చాలా కోపంగా, అసహనంగా వుంది. కాని అది ఏ విధంగా చూపించాలో అర్థంకాలేదు. తన ఆనందానికి అడ్డువచ్చిన ఆ రెండేళ్ళ పిల్లాణ్ణి నమిలి మింగేయాలన్నంత కోపంగా వుంది. ఇదేంఖర్మ! మొదటి రాత్రి హాయిగా వుండా ల్సిన తనకి ఈ పిల్లాడు అడ్డు వస్తున్నాడు. పిల్లడి తల్లిని పెళ్ళాడి తనేం తొందర పడలేదుగదా అన్నబాధ తలెత్తింది. వీడే అడ్డు లేకపోతే యీ పాటికి .... యీపాటికి ....చిరాకుగా మళ్ళీ ఇటు తిరిగాడు. సుగుణ వాడిప్రక్కనే పడుకుని నిద్రపుచ్చు తూంది. అర్థరాత్రి కావస్తూంది. కోపం ముంచుకు వచ్చింది భాస్కరరావుకి. ఏమిటీ వ్యవహారం? కనీ వినీ ఎరుగని సంగతి! శోభనంరాత్రి పెళ్ళాం పిల్లడి ప్రక్కన నిద్రపోవడం ఎక్కడన్నా ఉందా!.... అనుకున్నాడు. "అనుభవించు గొప్పగా, యేదో అనుకుని పిల్లాడి తల్లిని పెళ్ళాడితే ఇంతకంటే యేం అవుతుంది" అంది మనసు. ఈ వ్యవహారం యేదో తేల్చాలి! లేకపోతే రోజూ ఇదే వ్యవ హారం సాగితే లాభంలేదు! చాలా గట్టిగా మనసులో నిశ్చయించుకున్నాడు.

సుగుణ మరో అరగంటకి రవిని నిద్రపుచ్చి లేచి వచ్చింది. కోపంగా అటుతిరిగి పడుకొన్న భాస్కరరావుని ప్రసన్నం చేసుకోడానికి భుజంమీద చెయ్యి వేసింది "వెళ్ళు వెళ్ళు అక్కడే పడుకో" అన్నాడు చిరాకుగా.

"కోపగిస్తే ఎలా? నేనేం చెయ్యను వాడు నిద్ర పోకపోతే" అంది నెమ్మ దిగా సుగుణ. తెల్ల చీరలో మెరిసిపోతున్న అందమైన భార్య దగ్గిరికి వచ్చాక ఎంతో సేపు కోపాన్ని చూపలేకపోయాడు భాస్కరరావు. చేయిలాగి కూర్చో

పెడుతూ "చూడు, ఇదేమన్నా బాగుందా....నీవే చెప్పు...." అన్నాడు. సుగుణ యేం అంటుంది? "నా కిదేం నచ్చలేదు....ఎందుకలా అలవాటుచేయాలి పిల్లాడికి.... రేపట్నించి ఇదే వరసయితే నాకు కోపం వస్తుంది సుమా" అన్నాడు. సుగుణ జవాబీయలేదు. ఆమెకిదంతా యేమిటోలా వుంది. ఓ ప్రక్క కొడుకు, మరో ప్రక్క మొగుడు! ఎవర్ని కాదంటుంది? యేంచేస్తుంది? యేమిటి, ఇలాంటి అవస్థలో పడ్డాను అనుకుంది! మొదటిరోజు ఇలావుంటే....తరువాత....

"మాట్లాడవేం. ఎంతయింది టైము చూశావు. ఎన్నిగంటలు వృధా చేశావో చూడు" దగ్గిరికి తీసుకుంటూ భాస్కరరావు నవ్వుతూ అన్నాడు. బలవంతంగా నవ్వింది సుగుణ.

* * *

భాస్కరరావు, సుగుణ కాపురం పెట్టి పదినెలలవు తూంది.

ఈ పదినెలలు క్రొత్తగా పెళ్ళి చేసుకున్న సుగుణకి పది క్షణాలలాగ కాక పది యుగాలు గడిచినట్లనిపించింది. పెళ్ళి చేసుకుంటే జీవితంతో పోగొట్టుకున్న ఆనందం, సుఖం లభ్యమవుతాయని ఆశించిన ఆమె ఆశలు కోరికలు తీరకపోగా ఈ పెళ్ళి చేసుకుని పొరపాటు చేయలేదు గదా. చేసుకుని తప్పుచేశాను, పొరపడ్డాను.... తొందరపడ్డాను' అనుకున్న సంఘటనలు, సన్నివేశాలు చాలా జరిగాయి ఈ పది నెలలలో!

ఈ పెళ్ళి తనకి సుఖ సంతోషాలు యీయడం అటుంచి మరిన్ని సమస్యలని తెచ్చి పెడ్తుందని సుగుణ ముందు ఎన్నడూ ఊహించలేదు.

భాస్కరరావు యిలా ప్రవర్తిస్తాడని, యింతలో మారిపోతాడని ఊహించక పోవడం తనదే పొరపాటని వగస్తూంది. తమిద్దరి మధ్య కలతలకి, కలహాలకి తన బిడ్డ కారణంగా నిలుస్తాడని. ఆ బిడ్డని అంతలా ద్వేషిస్తాడని, శత్రువులా చూస్తాడని అనుకోని సుగుణ ఏమెరుగని పసిపిల్లాడిని అంత ఏహ్యంగా చూడడం సహించలేక పోతూంది. వాడి నీడ కూడ భాస్కరరావు భరించలేక పోతున్నాడని అర్థం అయ్యాక ఏం చెయ్యాలో తోచని స్థితిలో గిలగిలలాడ సాగింది.

ముందునుంచీ, కాపురానికి వచ్చిన రోజునించే రవిని ద్వేషిస్తున్నా చాలా రోజులకి గాని గ్రహించలేక పోయాననుకుంది సుగుణ.

ముందురోజు బెడ్‌రూములో రవి ప్రక్క కూడా వేస్తుంటే "వాడి ప్రక్క ఇక్కడెందుకు? ప్రక్కగదిలో వెయ్యి" అన్నాడు ఆదోలా. "వాడక్కడ ఎలా పడుకుంటాడు చిన్నపిల్లాడు" అంది మామూలుగా సుగుణ.

"అలాగే అలవాటవుతుంది. మనగదిలో పడుకో బెట్టడం మంచిదిగాదు. అలా నాకిష్టంలేదు" అన్నాడు కాని, రెండేళ్ళన్నా నిండని పసివాడిని మరో గదిలో వంటరిగా పడుకో బెట్టడానికి సుగుణ మనసు అంగీకరించలేదు.

"మరో ఏడాది, రెండేళ్ళు పోతే ఎలాగో పడుకోబెట్టాం, ఇప్పుడింకా చిన్న వాడు వాడొక్కడు ఎలా పడుకుంటాడు. అందులో వాడికసలు విడిగాపడుకోడం అలవాటు లేదు" అంది మామూలుగా సుగుణ. భాస్కరరావు కాసేపు వాదిం చాడు. మొహం ముడుచుకున్నాడు కాని సుగుణ అంత పట్టించుకోలేదు ఆ విషయం.

రాత్రిళ్ళు సుగుణ పడుకోడానికి రావడంలో ఆలశ్యం జరిగిందంటే అదంతా రవి వల్ల అని భాస్కరరావుకి కోపం వచ్చేది. వెళ్ళు వెళ్ళు నీకొడుకు దగ్గరే జోల పాటలు పాడుకుంటూ పడుకో. అని అలిగే వాడు. అవతల పిల్లాడ్ని నిద్ర పుచ్చ డం, తరువాత భర్తగారిని బ్రతిమాలుకోడం— అలా అవస్థపడేది సుగుణ.

పిల్లాడికి పాలుపడ్తునో, భోజనం తినిపిస్తూనో, స్నానం చేయిస్తున్నప్పుడో భాస్కరరావు పిలవగానే చేతిలోపని వదిలేసి రావాలనేవాడు. వాడే నీకు ముఖ్యం, నా మీద నీకేం లేదన్న మాట. ఎంతసేపూ వాడి ఆలనా పాలనాతో సరిపోతుందిగాని నా సంగతి నీకక్కర లేదని మొహం ముడుచుకుంటూ దెప్పేవాడు.

పిల్లాడి సంగతి చూడ కూడదనా ఏమిటి అతని ఉద్దేశం అని ఆశ్చర్యపడేది సుగుణ.

సుగుణ కొడుకుని ముద్దులాడుతూంటే యీర్ష్యగా చూసేవాడు భాస్కరరావు. మరీ పట్టలేనపుడయితే "చాల్లెద్దూ ఆ ముద్దులు.... మహా కొడుకు నీకేవున్నట్లు పొంగి పోతున్నావు" అనేవాడు నవ్వుతూనే. "అంతముద్దు వస్తున్నాదేమిటి, నీ కొడుకు?" ఆ మాటలకి కాస్త నొచ్చుకునేది సుగుణ. తన కొడుకు తనకి ముద్దు రాడూ?.... పొరపాటున కూడా ఎప్పుడూ భాస్కరరావు పిల్లాడిని దగ్గరికి తీసేవాడు కాదు. ఇంట్లో కొన్నాళ్ళ తర్వాత చనువు కొద్దీ రవి దగ్గర చేరితే తప్పుకునే వాడు భాస్కరరావు. సుగుణ చుట్టుప్రక్కల లేకపోతే బొమ్మన్నట్టు తీక్షణంగా గదమా యించి చూసేవాడు. వాడిని చూస్తూ, ఇంట్లో వాడు తిరుగుతుంటే ఏదో బాధగా వుండేది. వాడిని చూసినపుడల్లా సుగుణ మొదటి భర్త అప్రయత్నంగా గుర్తు వచ్చేవాడు! తన కంటె ముందు సుగుణ ఇంకోడిని ప్రేమించిందని, సుగుణని తన కంటే, ముందు మరోమగవాడు అనుభవించాడన్న నిజాలు గుర్తు వచ్చేవి. అసూయా ద్వేషాలతో మండి పడేవాడు భాస్కరరావు. ఆ అసూయ, అక్కసు తీర్చుకోడా నికి అందరి కంటె ముందు రవి కనపడేవాడు. వాడిని ఏదో చెయ్యాలని వుండేది.

కాని ఏం చెయ్యలేక పోయేవాడు. కొట్టినా నోరు వచ్చిన వాడు తల్లికి చెప్పుకొం టాడు వెధవ అనుకునేవాడు.

రోజులు గడుస్తున్న కొద్దీ తనకి సుగుణకి మధ్య అన్నింటికి ప్రతిబంధకంగా రవి వస్తున్నాడన్నది మరీ భరించరాని విషయంగా తయారయింది. ఆ కోపం సుగుణ మీద తీర్చుకునే వాడు! షికారు వెడదాం, సినిమాకి వెడదాం అనేవాడు. సుగుణ రవిని కూడా తీసుకు రావడానికి తయారయ్యే సరికి పట్టరాని కోపం వచ్చేది. "వీడెం దుకు తోకలాగ, వీడువద్దు" అనేవాడు, ఎలా అండీ, ఒక్కడ్నీ వదలడం అనేది మీ అన్నయ్య దగ్గిర వదిలేయ్, అనేవాడు భాస్కరరావు. సుగుణ అలాగేనని అక్కడ వదిలేసరికి మారాంచేసి ఏడ్చి రాగాలుపెట్టే కొడుకుని వదిలి వెళ్ళడానికి మనసు వప్పేది కాదు సుగుణకి. తీసికెడితే ఇంక భాస్కరరావు మొహం ముడుచు కుని అసలు మాట్లేదేవాడు కాదు. తీసికెళ్ళకపోతే కొడుకు ఏడుపు చూడలేక పోయేది సుగుణ. వదిలేసి వెళ్ళినా ప్రాణాలన్నీ వాడిమీదే వుండి ఆ సినిమాని కూడా చూడ లేక, అతనితో మాట్లాలేక అన్యమనస్కంగా వుండేది. అది చూసి మరింత మండి పడేవాడు భాస్కరరావు. అలాంటి అవస్థలో నలిగిపోవడం చాలాసార్లు అనుభవమ యింది సుగుణకి. ఎక్కడికన్నా వెళ్ళడానికి బయలు దేరడం అంటే ప్రాణసంక టంగా తయారయింది.

ఏ పండగ లప్పుడన్నా సుగుణకి బట్టలు తెచ్చేవాడుగాని రవికి తనచేతుల్తో తను తెచ్చేవాడుకాడు. ఆ విషయం సుగుణ గుర్తు చేసినా విననట్టు వూరుకునేవాడు. అంతగా మరీ చెప్తే "నాకు తెలియదు, నీవు వెళ్ళి కొనుక్కో" అనేవాడు.

ఆఖరికి రవి తిండి విషయంలో కూడా భాస్కరరావు కనపరిచే విభేదం చూస్తే సుగుణకి పట్టరాని దుఃఖం కలిగేది. "అన్ని పాలెందుకు? నా జీతంలో సగం వీడి పాలకే అయిపోతూంది" అనేవాడు భాస్కరరావు రవి పాలు తాగుతున్నప్పుడల్లా, రెండేళ్ళ పిల్లడు రోజుకి రెండు మూడు గ్లాసులు పాలు త్రాగడూ? అదే తన కడుపున పుట్టిన బిడ్డ అయితే అలా అనగలడా? అని నొచ్చుకునేది సుగుణ. వాడికి ఏమన్నా విటమిన్ మందులవీ యిస్తే "శుభ్రంగా తిని తిరుగుతున్నాడు. ఆ మందుల ఖర్చు కూడా ఎందుకు?" అని పైకే అనడం సుగుణ భరించలేక పోయేది.

రోజులు గడుస్తున్నకొద్దీ ప్రతి చిన్న విషయానికి రవిని గదమాయించడం ప్రతి చిన్న విషయానికి కూడా రాద్ధాంతం చేసి రవిని కొట్టడం వరకు వచ్చాక సుగుణకి యింట్లో నరకం ఆరంభమయింది. చిన్నపిల్లాడు ఏదన్నా పాడుచేయడం, బిడ్డలు కొట్టడం, అల్లరి చేయడం సహజం? దానికోసం యింతలా పగసాధిస్తున్నట్టు అంతలా ద్వేషిస్తారా అని సుగుణ మాటకి మాట జవాబీయడం ఆరంభించింది. "నీ కొడుకు నీకు ముద్దేమో కాని, ఆ వెధవ చేసే పనులు సహించడం నా వల్ల కాదు

న్నావల్ల గాదు" అని కోపంగా అరిచేవాడు సుగుణ ఏమనలేక రవిని ఎత్తుకుని కన్నీళ్ళు పెట్టుకునేది.

"ఛీ.... ఛీ.... వెధవయిల్లు.... నేరకపోయి తద్దినం తెచ్చుకున్నాను వెధవలు-వూరి వాళ్ళ పిల్లల్ని భరించడం నాకేం ఖర్మ" అనే వరకు వచ్చాడు భాస్కరరావు.

తన సొమ్మంతా ఆ రెండేళ్ళ పిల్లాడు తిని పోతున్నంత దుగ్ధ ఏర్పడింది భాస్కరరావుకి. రేపొద్దున తనకి పిల్లలు పుడ్తారు. వాళ్ళతోపాటు యీ రవిగాడిని ఎందుకు భరించాలి! వాడికి చదువు సంధ్యలు చెప్పించడం తనకేం అవసరం? అసలు ఇంకోడు కన్న పిల్లడిని తన యింట్లో ఎందుకు పెట్టుకోవాలి. ఆ వెధవ మూలంగా తనకి ఏ ఆనందం దక్కకుండా వుంది ఆ వెధవ మూలంగా తామిద్దరికి మనస్పర్థలు.... కలతలు.... వస్తున్నాయి.... ఛా! ముందు ఇంతదూరం ఆలోచించకుండా తొందరపడ్డానను కుని పశ్చాత్తాపం ఆరంభించింది భాస్కరరావుకు.

ప్రతిరోజూ భార్యాభర్తల యిద్దరి మధ్య రవి కారణంగా ఏదో తగవు తప్పదం లేదు! రోజురోజుకి యీ గొడవలు భరించడం యిద్దరికిద్దరికి కష్టమవసాగింది.

ఆ కోపం, కసీ మరోవిధంగా తీర్చుకోడం కూడా సాగించడం మొదలుపెట్టాడు భాస్కరరావు.

సుగుణ కాన్త ఉదాసీనంగా వుంటే "ఏం, పాత మొగుడు గుర్తువస్తున్నాడేమిటి?" అనేవాడు.

భాస్కరరావు వరసం మరీ ఎక్కువయిన రోజున సుగుణ కాన్తకోపంగా "ఏమిటా మోటు తనం" అంటే "నీ పాతమొగుడు యింతకంటే నాజూగ్గా ప్రవర్తించేవాడా" అని దెప్పేవాడు. "ఇంతకంటే బాగుండేదా నీ ఆ మొగుడి వరసం" అని అసహ్యంగా కూడా మాట్లాడడం ఆరంభించాడు. సుగుణ కళ్ళలోబాధ చూస్తే కసిదీరినట్లుండేది భాస్కరరావుకి.

ప్రతి విషయానికి అవసరం వున్నా లేక పోయినా రోజుకి పదిసార్లు "పాత మొగుడు" అంటూ దెప్పుతూంటే ఎన్నో రోజులు సహించలేక ఓ రోజు సుగుణ కాన్త తీక్షణంగా "నన్నెందుకిలా పదే పదే నాకు ఆ పాత సంగతులు గుర్తుచేసి బాధిస్తారు....ఆ రోజులు మరిచిపోకుండా ఎందుకిలా గుర్తుచేసి హింసిస్తున్నారు" అంది.

"ఏం గుర్తు చేస్తే అంత బాధగా వుందేమిటి? పాపం ఆయనను ఇంకా మరిచిపోలేక పోతున్నావన్నమాట. ఏం నాకంటె బాగా చూసేవాడన్నమాట నిన్ను...." అంటూ మరింత వ్యంగ్యంగా విసుర్లు విసిరేవాడు.

రోజురోజుకీ భాస్కరరావులో చెలరేగేరాక్షసత్వం క్రూరత్వం పెచ్చుపెరుగుతూంటేసుగుణకు ఆ యింట్లోబ్రతకడందుర్భరమవసాగింది. కాని ఏం చేస్తుంది?కావాలని పెళ్ళాడి యిప్పుడేం చేయగలదు? రోజూ యిద్దరూ దేని గురించో వాదించుకోడం. దెబ్బలాడు కోడం. మాటలు విసురుకోడం, తిండి మానేయడం, భాస్కరరావు యిల్లు చేరకపోవడం మొదలైన ఘటనలు జరుగుతున్నా పెళ్లి జేసుకున్నాం, తప్పదు ...అని సుగుణ ఓపిగ్గానే ఆ నరకం భరిస్తూంది.

కానీ సహానానికి ఓర్మికి దేనికన్నా హద్దుంటుంది! ఆ హద్దు సుగుణ విషయంలో ఆ రోజు దాటిపోయింది.

రవికి రెండు రోజుల నుంచి జర్వం. ఆ రెండు రోజులు ఏదో మామూలు జ్వరం అన్నట్టు ఏవో తెలిసినమందులు వాడింది. అయినా తగ్గలేదు. మూడో రోజు భయపడుతూనే భాస్కరరావుతో చెప్పింది.

"నన్నేం చెయ్యమంటావు" విసుగ్గా అడిగాడు. ఇదే తండ్రి అయితే ఏం చెయ్యమంటావు అని అడుగుతాడా అని బాధకలిగింది సుగుణకి: అయినా అదేం కన్పించనీయకుండా "డాక్టరెవరినైనా తీసుకురండి" అంది.

భాస్కరరావు చిరాగ్గా మొహం చిట్లించాడు "నేను వెళ్ళలేను. నీవే వెళ్ళి పిలుచుకో, లేకపోతే అక్కడికి తీసికెళ్ళి చూపించుకో" అన్నాడు.

సుగుణకి వళ్ళు మండిపోయింది "పిల్లాడు జ్వరంతో పడి వుంటే డాక్టరుని తీసుకురావటాకి కూడా మీకు అంతకష్టంగా వుందన్నమాట. ఆడదాన్ని నేను వెళ్ళి డాక్టరుని పిలుచు కోవాలన్నమాట....ఇదే మీ పిల్లాడయితే ఇలా అనే వారా? వాడు మీ కొడుకు కాదని కదూ ఇంత నిర్లక్ష్యం, ఇంత అసహ్యం వాడిమీద!" తీక్షణంగా అంది. భార్కరరావు, ఏం బెదరలేదు ఆ కోపానికి.

"అవును....వాడు నాకేం అవుతాడని నాకుంటుంది అదుర్దా....నా కొడుకు అయితే ఎందుకూరు కుంటాను. ఇదేదో క్రొత్త సంగతి కనిపెట్టినట్టు మాట్లాడకు" అన్నాడు హేళనగా.

సుగుణకి వుడుకుమోత్తనంతో పాటు దుఃఖంకూడా వచ్చింది. "పిల్లాడు రోగంతో పడుకుంటే ఎలామాట్లాడుతున్నారు? మీకు పిల్లలుండివుంటే, వీడే మీ పిల్లాడయితే నేను ఇలా ప్రవర్తించివుంటే మీకెలా వుండేది...."ఉక్రోషంగా అంది. భాస్కరరావు హేళనగా నవ్వాడు.

"ఎలా వుండడానికి ఏముంది? నాకే పిల్లలు వుంటే, సవతి తల్లి ఆ పిల్లలని ఎలా చూసేదో వందలు. వేలు కథలు విన్నాం....వాళ్ళలో నీవూ ఒకరి క్రిందజమ

అయివుండే దానివి....లేకపోతే ఇంకోరి పిల్లల్ని ఏ ఆడదిగాని, మగాడుగాని స్వంత పిల్లల్లా చూస్తారా ఏమిటి?"

"అవును. లోకం ఇన్నాళ్ళూ సవతి తల్లుల కథలే వింది. ఆ సవతి తల్లుల కంటె యీ సవితి తండ్రుల క్రూరత్వం ఏంతీసిపోదని మీ కథ ఋజువుచేస్తూంది. నన్ను నా మానాన నా ఖర్మకి పడివుండనీయకుండా, నాలో లేని పోని ఆశలు కల్పించి పెద్ద కబుర్లు చెప్పి ఆదర్శమూర్తులని పించుకునేందుకు ఈ పెళ్ళి చేసుకున్నారు. చేసుకొన్న దగ్గరనించి ఒక్కలా కాల్చుకు తిన్నారు. పెళ్ళికి ముందు నాకు పిల్లాడున్నాడని, ఆ పిల్లాడు నాతో వుంటాడనీ తెలియకే చేసుకున్నారా? తెలిసి తెలిసి చేసుకుని నా బ్రతుకు నిలా నరకం ఎందుకు చేస్తున్నారు చెప్పండి? ఈ పెళ్ళి చేసుకుంటే ఏదో సుఖముంటుందని భ్రమిశాను. కాని యీ బ్రతుకు ఆ "వెధవ బ్రతుకు" కంటె అధ్వాన్నంగా వుంటుందని, అంతకు మించిన నరకం చూస్తానని ముందే తెలుస్తే చస్తే యీ పెళ్ళి చేసుకునే దాన్నికాను....నోరెరుగని పసి వాడి మీద అంత కసి. ద్వేషం ఎందుకు మీకు, వాడేం చేశాడని వాడిని అలా ద్వేషిస్తున్నారు. వాడు కూర్చుంటే తప్పు, నిల్చుంటే తప్పు, పడుకుంటే తప్పు, వాడేం చేసినా కోపం, వాడినీడ చూస్తేనే ద్వేషం? వాడు....ఆ పసి వాడు ఇంట్లో బిక్కు బిక్కు మంటూ దీనంగా ఏం చెస్తే తప్పో నన్నట్టు భయం భయంగా తిరుగుతూంటే నా హృదయం ఎంత రంపపు కోత అనుభవిస్తుందో తెల్సా? తల్లి ముందే తన పసిబిడ్డని అంత ద్వేషించడం చూసి ఏ తల్లి అన్నా సహిస్తుందను కుంటున్నారా? మీరు వాడిని ఎంత హీనంగా చూస్తున్నా యిన్నాళ్లూ సహించాను: కేవలం మిమ్మల్ని పెళ్ళాడిన నేరానికి....ఆఖరికి పసివాడికి రోగం వస్తే మందిప్పించడానికి కూడా మీకు మనస్కరించడం లేదంటే మీరు....మీరు మనుష్యులుగారు.... పాషాణం ..." ఆవేశంతో, కోపంతో, దుఃఖంతో సుగుణ గొంతు వణికింది.

"నోర్ముయ్...." కోపంగా అరిచాడు భాస్కరరావు...."ఈ పెళ్ళి చేసుకుని నీవు కాదు నష్టపడింది. నష్టపడింది నేను"....బాధ పడ్తున్నది నేను....తెలియక నేను ...తెలియక ఏదో అనుకున్నాను గానీ తెలిస్తే నేనూ ఛస్తే చేసుకునే వాడిని కాను, పెళ్ళి చేసుకున్నాను. నా సరదాలు ఏం తీర్చావు నీవు. సినిమాకి వెడదామంటే వాడో అంటావు. షికారుకి వెడదాం అంటే వాడుండాలి అంటావు. హానీమూన్ వెడదాం అంటే వాడ్నొదిలి ఎలా రానంటావు. ఎప్పుడు సరదాగా కాలక్షేపం చేయడానికన్నా పిలిస్తే నీకు ఎంతసేపూ వాడి భోజనం, వాడినిద్ర, వాడి ఆలానా పాలనా తప్ప, నా సంగతి నీ కెప్పుడన్నా పట్టిందా! ఎప్పుడు చూసినా ఆ వెధవని పట్టుకుని ఏడుస్తూంటే....తను కనని పిల్లాడ్ని పట్టుకుని ఏడుస్తూంటే ఏ మగాడన్నా సహిస్తాడనుకున్నావా? నా సరదా, నా ముచ్చటలు ఏం తీర్చావు నీవు? వాడిని

....వాడిని చూస్తుంటే....నీవు ....నీవు నా దానివి కాక ముందు మరోడి పెళ్ళాని వని....వాడి ద్వారా ఆ పిల్లాడిని కన్నావని ...నా కంటె ముందు మరోడు నిన్ను అనుభవించాడని అనుక్షణం వాడి ఉనికి జ్ఞప్తికి తెస్తుంటే ....నా కెలా వుంటుందో నీకేం తెలిస్తుంది. నా మీదకంటె....ఆ కుర్ర వెధవమీద ఇంకోడి పిల్లాడిమీద నీకు శ్రద్ధానక్తులు ఎక్కువవుంటే ఇవతలి వాడికి ఎలా వుంటుందో నీ కెలా తెలుస్తుంది...." భాస్కరరావు ఎగిరి పడ్డాడు.

"అయితే ముందిది తెలియదా?"

"ముందు నీకు తెలియనట్టే....నాకూ తెలియలేదు....కనకనే గోతిలోకి దిగాను. లేకపోతే మగాడ్ని....ముప్పై ఏళ్ళున్న మగాడికి పెళ్ళాడడానికి పిల్లలు దొరకరని నిన్ను రెండో పెళ్లిదాన్ని, పిల్లాడి తల్లిని కట్టుకుందేవాడిని కాను. తెలియకనే మోనపోయాను....యీ వెధవ పిల్లడి వల్ల నీకు నాకు మధ్య అడ్డుగోడలు లేస్తాయని, యీ కుర్ర వెధవ యిలా నా ఆనందాన్ని హరిస్తాడని ముందు తెలిస్తే...." కసిగా అంటున్నాడు భాస్కరరావు.

"ఆపండి....మాటిమాటికి వెధవపిల్లాడంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి. నా ముందే ఇంతలేసి మాటలు నోరెరుగని పసివాడిని అంటుంటే యే తల్లి అయినా సహిస్తుందను కుంటున్నారా? ఇన్నాళ్ళు సహించాను ఇక సహించను" పౌరుషంగా అంది సుగుణ.

"సహించకపోతే మానేయి....నేనూ ఇదంతా సహించలేను....ఇంకోడు కన్న పిల్లాడ్ని ఇంట్లో పెట్టుకుని బాధపడాల్సిన అవసరం నాకేం లేదు" కఠినంగా అన్నాడు భాస్కరరావు.

"అంటే యేమిటి మీ ఉద్దేశం?" ఎగిసిపడుతున్న గుండెలతో ఆవేశంగాఅంది సుగుణ.

"అంటేనా? విడమర్చి చెబుతున్నాను విను....ఈ ఇంట్లో నీకు వుండాలని వుంటే నా దగ్గిర వాడుండటానికి వీలులేదు"

"యేమిటి? పిల్లాడు తల్లిదగ్గిర వుండకుండా ఎక్కడ వుంటాడని మీ ఉద్దేశం?"

"అదంతా నా కనసరం! వాడిని ఎక్కడ వుంచుతావో. యేం చేస్తావో నా కక్కర లేదు. కావలిస్తే మీ అన్నయ్య ఇంట్లో వుంచి, డబ్బుపారేయ్...."

సుగుణ కళ్ళు ఎర్రబడ్డాయి. "నేను కన్న పిల్లాడిని పెంచాల్సిన అవసరం మా అన్నయ్యకేం లేదు" వ్యంగ్యంగా అంది.

"నేను కనని పిల్లాడిని వుంచుకోవాల్సిన అవసరం నా కంతకంటే లేదు." అంతకంటే హేళనగా అన్నాడు భాస్కరరావు.

"మీ ఉద్దేశం స్పష్టంగా చెప్పండి. నన్నింట్లోంచి వెళ్ళమనా అర్థం?"

"నిన్ను వెళ్ళమనలేదు. నేనన్నదల్లా నీకు నేను కావాలో వాడుకావాలో తేల్చుకోమన్నాను—ఆలోచించుకో...."

సుగుణ ఓ క్షణం ఆవేశంతో ఊగిపోయింది. అంతలోనే నిలదొక్కుకుంది. పిచ్చిదానిలా పెద్ద నవ్వు నవ్వింది హేళనగా. వ్యంగ్యంగా "ఛాయిస్ ఇచ్చారన్నమాట. మొగుడా? పిల్లాడా? అంటూ. భేష్ .. ఆలోచించాలా....ఈ విషయం గురించి ఆలోచించడానికి యే తల్లికీ అరక్షణం కూడా పట్టదని మీ లాంటి మగాళ్ళకి తెలియక పోవచ్చు! నోరెరుగని పసివాడిని అనాధ చేసి మొగుడుతో కులుకుతుంది ఆడది అని మీరనుకుని ఛాయిస్ ఇచ్చారా నాకు! నోరెరుగని పక్షులు సైతం రెక్కలురాని తమ బిడ్డలని రక్షించుకోడానికి తమ ప్రాణాలు సైతం అర్పిస్తాయే అలాంటిది మనిషినయిన నేను నా పసివాడిని వదిలి మీతో వుంటాననే ఛాయిస్ ఇచ్చారా? మాతృహృదయం ఎలాంటిదో తెలియకే ఛాయిస్ ఇచ్చారా? నేను కాకపోతే మరో పెళ్ళాం మీకు క్షణంలో వస్తుంది కాని వీడికి తల్లి రాదు అని తెలియనంత తెలివి తక్కువతనం నా కుందనే ఛాయిస్ ఇచ్చారా మీరు! ... ఇదే మీ పిల్లాడయితే.... నేనే మీకు ఈ ఛాయిస్ ఇచ్చి వుంటే మీరు నన్నే ఎంచుకు సుండేవారు. కన్నతండ్రి బిడ్డల్ని అలక్ష్యంచేసి పెళ్ళాంతో కులకబట్టే సవతి తల్లుల కథలు వచ్చాయి! కాని.... తల్లి....తల్లి వుండగా బిడ్డమీద ఈగ వాలనీదు! బిడ్డని రక్షించుకోడానికి అవసరమైతే రాక్షసి అవుతుంది. పెంచుకోడానికి ముష్టి అన్నా ఎత్తగలదు! బిడ్డకోసం యే త్యాగమన్నా....అఖరికి భర్త నన్నా సరే వదులుకోగలదు. తండ్రికి, తల్లికి తేడా యిప్పటికయినా తెలుసుకోండి! ఇప్పటికయినా యీ నరకంలోంచి నా బిడ్డకు విముక్తి కలిగి స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోడానికి అవకాశం యిచ్చినందుకు సంతోషం! ఎదొచ్చి ఈ పెళ్ళి చేసుకుని లోకంలో ఇదివరకు వుండే సానుభూతి కాస్త పోగొట్టుకుని హేళన పాలయాననేదే నా ఆవేదన! ఈ సంగతి ముందు తెలుసుకోలేక తప్పటడుగు వేసి అందరిచేత అన్పించుకునే స్థితికి వచ్చాననేదే నా బాధ. వస్తా.... శలవు." అంటూ పిల్లాడిని తీసుకుని భుజంమీద వేసుకున్న సుగుణని వెర్రివాడిలా చూశాడు భాస్కరరావు.

"స్వాతి"

★